సార్వా మాసూళ్లు ప్రారంభం

- ఇప్పటివరకు కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ఆందోళన చెందుతున్న రైతులు

వీరవాసరం: సార్వాసాగులో మాసూళ్లు ప్రారంభమయ్యాయి. సార్వా సాగులో ఎంటీయూ 1314, సంపద, ఐఆర్ 64, తక్కువ మోతాదులో స్వర్ణ రకాలను సాగు చేశారు. ప్రస్తుతం సార్వాసాగు పూర్తి కావస్తోంది. దీంతో మాసూళ్లు వేగవంతంగా ప్రారంభమయ్యాయి. రైతులు వరి కోత యంత్రాల ద్వారా వరి చేలను కోస్తూ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు. ప్రస్తుత సార్వా సీజన్‌లో సార్వాసాగు ప్రారంభం నుంచి అధిక వర్షాలు, చీడ పీడలతో రైతులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు పంట చేతికొచ్చిన ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితులు ప్రస్తుతం కనిపించడం లేదు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ధాన్యాన్ని రైతుల నుంచి కొనడానికి ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచింది. రైతు పండించిన ప్రతి గింజను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులను నష్టాలబారి నుంచి తప్పించింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు రైతులను పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వా పంట మాసూళ్లు అవుతున్నా కనీసం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే పరిస్థితులు ఎక్కడా కానరావడం లేదని రైతులు



వీరవాసరంలో సార్వా మాసూళ్లు చేస్తున్న రైతులు

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దళారి వ్యవస్థ లేకుండా చూడాలని, పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

హామీల అమలు విషయంలో ముఖం చాటేస్తున్న చంద్రబాబు



ఉండి జంగాల కాలనీలో దరఖాస్తులు పంపిణీ చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు

ఉండి: అధికారంలోకి వచ్చాక ఎన్ని హామీలు అమలు చేయమంటే సీఎం చంద్రబాబునాయుడు ముఖం చాటేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. స్థానిక జంగాల కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కలిశెట్టి వెంకట్రావు,క లింగ లక్ష్మణ రావు ఆధ్వర్యంలో ఆదివారం అర్హులైన నిరుపేదలకు దరఖాస్తులు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే అర్హులందరికీ గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో అయితే రెండు సెంట్లు భూమి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రజలకు ముఖం చాటేసారని అన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. ఈ నెల 18న ఇళ్లస్థలాల కోసం, గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రతి గ్రామ సచివాలయం వద్ద, మండల కేంద్రాల్లోను ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప కార్యదర్శి ఆర్.వెంకట్రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా సమితి సభ్యుడు సనపల శ్రీను, కోన గొల్లయ్య, ఏరియా సమితి కార్యదర్శి టి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరమైన జీవనం గడిపేందుకు జోనల్ మీట్

ఆకివీడు: సేవాతత్పరులు ఆహ్లాదకరమైన జీవనం గడిపేందుకు ప్రతీ ఏటా లయన్స్ జోనల్ మీట్ కార్యక్రమం ప్రకృతి పరవశింపజేసే వాతావరణంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు చెప్పారు. ఆకివీడు, చినకాపవరం లయన్స్ జోనల్ మీట్ కార్యక్రమం ఆటపాకలోని పక్షుల ఆవాస కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు కుటుంబ సమేతంగా పాల్గొని ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపారు. అనంతరం దివ్యాంగుడికి ట్రై సైకిల్, ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. జోన్-1చైర్మన్ మద్రివాడ శ్రీనివాసరావు, జోన్-2 చైర్మన్ వేగేశ్న వెంకట కృష్ణంరాజుల ఆధ్వర్యంలో



విద్యార్థులకు సైకిళ్లు, దివ్యాంగుడికి మూడుచక్రాల సైకిల్ అందజేస్తున్న దృశ్యం

జరిగిన కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ ఆర్వీ సూర్యనారాయణరాజు, సీహెచ్ కృష్ణంరాజు, దాట్ల రామరాజు, పిన్నమరాజు మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవన విధానంలోనే ఆరోగ్య రహస్యం

పాలకోడేరు: మన జీవన విధానం లోనే ఆరోగ్య రహస్యం దాగి ఉందని, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ టి.శ్రీనివాసరావు(హైద్రాబాద్) పేర్కొన్నారు. శృంగవృక్షం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మండపం లో జరిగిన కార్తీక వన సమారాధన సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై నిత్య జీవితం లో ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలపై ప్రసంగించారు. జీవించినంత కాలం ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అలా ఉండాలంటే ప్రతి విషయాన్ని అనుకూల దృక్పథం తో ఆలోచించాలని అన్నారు. అనంతరం ఆయనను ఆర్య వైశ్య సంఘం నాయకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రాజా



ఆయుర్వేద వైద్యుడు శ్రీనివాసుని సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

మానస, మస్తాన్ కుమార్, సంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పూర్ణారావు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటాను సద్వినియోగం చేసుకోవాలి



పాల్గొన్న బాస్కెట్ బాల్ క్రీడాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్పోర్ట్స్ కోటా ద్వారా క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ పెంచారని, సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని బాస్కెట్ బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోడే వెంకట్రావు మున్సిపల్ స్కూల్‌లో బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10 టీంల క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానం తాడేపల్లిగూడెం, రెండో స్థానంలో దేవరపల్లి మండలం రామన్నపాలేనికి చెందిన టీంనిలిచింది. బాలికల విభాగంలో మొదటిస్థానం తాడేపల్లిగూడెం, రెండో స్థానం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిలిచింది. విజేతలకు చిట్యాల పద్మిని, బొలిశెట్టి రాజేష్ బహుమతులు అందజేశారు. పోటీలను పీడీ చింతకాయల సత్యనారాయణ, అశిష్ రాజు, రాజేష్ పర్యవేక్షించారు.

నేతన్నలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలి

ఆకివీడు: సమైక్యత, సహృద్భావం, ప్రేమానురాగాలు పెంపొందించేందుకు కార్తీక వన సమారాధనలు దోహదపడతాయని బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వావిరాల సరళాదేవి చెప్పారు. స్థానిక పద్మసాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆదివారం స్థానిక దుంపగడప రోడ్డులోని స్వర్గీయ నాగులపల్లి వీరాస్వామి రైస్‌మిల్లు ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నేతన్నలుగా పేరొందిన సాలీలు మనిషికి కావాల్సిన వస్త్రాలు నేయడమే కాదు, మనిషి అవసరాలు తీర్చేందుకు రాజకీయాల్లో ప్రముఖ స్థానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సరళాదేవి

పొందాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సంఘ అధ్యక్ష కార్యదర్శులు సప్పా మణికంఠ, కార్యదర్శి నాగులపల్లి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

బీచ్‌లో సందర్శకుల సందడి

మొగల్తూరు: కార్తీకమాసం రెండో ఆదివారం పలు ప్రాంతాల నుంచి సందర్శకులు పేరుపాలెం బీచ్‌కు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. ప్రతి ఏటా కార్తీకమాసం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తారు. సుమారు 5వేలమంది పర్యాటకులు బీచ్‌ను సందర్శించారని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే ఆర్డీఓ దాసి రాజు బీచ్‌ను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రాజ కిశోర్, ఎంపీడీఓ త్రిశూల పాణి, సిబ్బంది ఉన్నారు. మరోవైపు డీఎస్పీ ఎంబీఎస్ మురళికష్ణ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐల పర్యవేక్షణలో 90 మంది సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లులో పాల్గొన్నారు.



బీచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

పేదలపై భారాన్ని తగ్గించాలి

నరసాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల బాధలు తీరుస్తాయని ఎన్నుకుంటే ప్రజలపైన మరింత భారాన్ని మోపుతున్నారని, ఆ భారాన్ని తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బలరామ్ విమర్శించారు. నరసాపురం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ తాపీ పనివారల సంఘ భవనంలో ఆదివారం సీపీఎం 25వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభలు సూచిక, పార్టీ జెండాలను ఆవిష్కరించి, అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచినీటి నీటకంఠం, బూడిద భువనేశ్వరిలు అధ్యక్షులుగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నాయన్నారు. కొత్త మద్యం పాలసీతో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బలరామ్

ఎద్దేవా చేశారు. ఇసుక సమస్యతో నిర్మాణరంగం కుదేలైందన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, నోముల కొండ, పుగాకు నారాయణరావు, పుగాకు పూర్ణ, గుత్తుల సాగార్, కె.బద్రి తదితరులు పాల్గొన్నారు.

క్షీరపురి నుంచి శైవ క్షేత్రాలకు బైక్ యాత్ర

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శైవ క్షేత్రాల బైక్ యాత్ర ఘనంగా ప్రారంభించారు. ఆదివారం స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆల యం వద్ద రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ బైక్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఇలాంటి యాత్రలు నేటి తరానికి ఆధ్యాత్మిక భావాలను పెంపొందిస్తాయ న్నారు. పాలకొల్లు నుంచి బయలుదేరిన ఈ బైక్ యాత్ర ముందుగా పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామం, వీరవాసరం, భీమవరం, యనమదుర్రులో ఉన్న శైవ క్షేత్రాలను దర్శించుకోనున్నట్లు సేవా సమితి సభ్యులు శీరం ఆనంద కృష్ణ తెలిపారు. సుమారు 500 మంది భక్తులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్షీరారామ



శైవ క్షేత్రాల బైక్ యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

లింగేశ్వరస్వామి ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రధానార్చకుడురమణ గురుస్వామి, జక్కంపూడి కుమార్, ధనాని సూర్యప్రకాష్, ఆలయ ప్రధానార్చకుడు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షపత్రి పూజ

పెనుగొండ: కొడమంచిలి శివాలయంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పార్వతి మాతకు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బ్రాహ్మణ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులకు ఆన్ రోడ్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ బస్సులు కండీషన్‌లో ఉన్నదీ, లేనిదీ తెలుసుకునేందుకు ఆన్ రోడ్ పరీక్షలు నిర్వహించినట్లు డిపో మేనేజర్ ఏలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. బస్సు మెయింటినెన్స్, రోడ్డుపై ప్రయాణం చేసినప్పుడు బస్సు కండీషన్, ఇంజన్, బ్రేక్ తదితర విషయాలను ఆదివారం పరిశీలించారు. గ్యారేజీ సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, డ్రైవింగ్ శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు గట్టెక్కించేనా?



జగన్నాథపురంలో వంగసాగు



పెనుగొండలో దొండ పాదులు

పెనుగొండ: వరుస తుఫాన్‌లతో తీవ్రంగా నష్టపోయిన కూరగాయల సాగు పెరిగిన ధరలు గట్టెక్కిసాయన్న గంపెడాశతో రైతన్నలు ఉన్నారు. ఆచంట నియోజకవర్గంలో సిద్ధాంతం, దొంగరావిపాలెం, కొతాలపర్రు, రామన్నపాలెం, తామరాడ, చినమల్లం, ములపర్రు,ఆచంట మండలంలో అయోధ్యలంక, పుచ్చలంక వంటి లంక గ్రామాల్లోనూ, పోడూరు, పెనుమంట మండలాల్లోనూ కూరగాయల సాగు వైపు రైతన్నలు మళ్లుతున్నారు. అయితే ఇటీవల వరుస తుఫాన్‌లు, గోదావరి వరదలతో కూరగాయల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా ఏటిగట్టు పరివాహక ప్రాంత లంకల్లోనూ, సిద్ధాంతం మధ్యస్థ లంకలోనూ, అయోధ్యలంక, పుచ్చల్లంకలోనూ గోదావరి వరదనీరుతో కూరగాయల తోటలు పూర్తిగా మునిగి పోయాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు కాస్తా వరదపాలయ్యాయి. దీంతో సుమారు ఒక్కో రైతు రూ.50 వేలు వరకూ నష్టపోయారు. దీంతో కొంత మంది రైతులు తిరిగి నారు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరద, తుఫాన్‌ల తాకిడిని తట్టుకొని నిలబడ్డ తోటల్లోనూ రైతులు సాగు కొనసాగిస్తున్నారు. ఈ తరుణంలో కూరగాయల ధరలు పెరగడం రైతుకు ఊర ట కలిగించింది. ఆశించిన దానికన్నా ధరలు పెరగడంతో రైతులకు ఆయాచితంగా వరంగా మారింది. తుఫాన్‌లు, వరదలతోపోయిన నష్టాన్ని భర్తీ అవుతుందని భావిస్తున్నారు.

దళారులకే లాభసాటి

ఇదిలా ఉండగా, కూరగాయలు దళారులకే లాభసాటిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ చేసుకోవడానికి సరైన సదుపాయాలు లేకపోవడంతో దళారులపైనే ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటూ వాపోతున్నారు. టోకు మార్కెట్‌కు కూరగాయలు అధికంగా వస్తే ధరలు తగ్గించి దళారులు కొనుగోలు చేస్తున్నారని, మరో రోజు నిలువ ఉంచుకోవడానికి కోల్డ్ స్టోరేజీ వంటి సదుపాయం లేకపోవడంతో టోకు మార్కెట్‌కు వెళ్లిన అనంతరం అయినకాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం టోకు మార్కెట్ వద్ద స్టోరేజీ సదుపాయం ఏర్పాటు చేస్తే రైతులకు సదుపాయంగా ఉంటుందంటూ తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులకు అండగా నిలవాలని కోరారు.

వరుస వరదలతో ఇబ్బందులు



ఈ సీజన్‌లో వరుసగా వరదలు రెండు పర్యాయాలు రావడంతో పాటు, వరుస తుఫాన్లు రావడంతో కూరగాయల రైతులు అందరూ ఇబ్బందులు పడ్డారు. అయితే, రెండు నెలలుగా కూరగాయల ధరలు ఆశించిన స్థాయిలో ఉండడంతో నష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంది.

– కుడిపూడి మునలయ్య, కూరగాయల రైతు సిద్ధాంతం

క్లుప్తంగా

డయాలసిస్ థెరపిస్టుల సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్యే అంజిబాబుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

భీమవరం: డయాలసిస్ థెరపిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం సభ్యులు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్కే రహీమ్, జిల్లా అధ్యక్షుడు సాకా సురేష్, కార్యవర్గ సభ్యులు వి.దినేష్. ఐ.మోహన్, పి.కుమార్ మాట్లాడారు. కిడ్నీలు పాడైన వారికీ 24 గంటలూ సేవలు చేస్తూ వాళ్ల ప్రాణాలకు నిత్యం నీడలా ఉన్న డయాలిసిస్ థెరపిస్టులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. కుటుంబ పోషణకు, ఆరోగ్య భద్రతకు సరిపడేంత జీతం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని డయాలిసిస్ థెరపిస్టులకు ప్రభుత్వ ఉద్యోగాలు, కనీస వేతనాలు కల్పించాలని కోరారు.

ఘనంగా పాస్టర్స్ డే వేడుకలు



చిలుకూరులో పాస్టర్స్‌డే వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: మహనీయుడు, సంఘ సంస్కర్త మార్టిన్‌లూథర్ జయంతిని పురస్కరించుకుని ఉండి ఎన్నార్పీ అగ్రహారం పేరిష్ పరిధిలోని చిలుకూరు సెయింట్‌థోమా లూథరన్ చర్చిలో ఫాదర్స్‌డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేరిష్ పాస్టర్ రైట్ రెవరెండ్ డి.మేషక్ సతీష్‌కుమార్‌ను సంఘ పెద్దలు, స్త్రీల సమాజ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం సతీష్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో మనుషుల్లో మంచిని, మానవత్వాన్ని పెంపొందించేందుకు అహర్నిశలు కృషి చేసేవాడు పాస్టర్ అని అన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు జి.యాకోబు, ఎం.శ్యాంబాబు, ఓగిరాల ప్రసాద్, ఏసురత్నం పోతురాజు, పీసీసీ ఉన్నమట్ల రత్నరాజు, వి.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణకు చలో విజయవాడ

ఉండి: రాష్ట్ర విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దేవాలయాల పరిక్షణ కొరకు వచ్చే యేడాది జనవరి 5వ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు.ఆదివారం ఉండి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరిచెర్ల సుభాష్‌రాజు, నియోజక వర్గ కన్వీనర్ కొమ్మన నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కార్తీక మాసం సందర్భంగా బీచ్‌కు వెళ్లే వారు కూడా అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచారామ యాత్ర బస్సు ప్రారంభం



నరసాపురం డిపోలో పంచారామాల బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: కార్తీక మాసం సందర్భంగా పంచారామాలను దర్శించుకునేందుకు నరసాపురం డిపో నుంచి నాలుగు బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుబ్బన్న రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పంచారామాల బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. నరసాపురం నుంచి రాత్రి 7.30 గంటలకు బస్సు బయలుదేరి అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు మీదుగా తిరిగి నరసాపురం చేరుకుంటుందన్నారు. ఈ అవకావాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

14 నుంచి వెలివర్రులో సువార్త సభలు

ఉండి: మండలంలోని వెలివర్రు సెయింట్ జాకబ్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో గురువారం నుంచి శనివారం వరకు క్రీస్తు రక్షణ ఉజ్జీవ సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. పేరిష్ పాస్టర్లు రైట్ రెవరెండ్ డీ మేషక్‌సతీష్‌కుమార్,రెవరెండ్ ఎస్ అబ్షాలోమ్‌రాజు ఈ సభలను ప్రారంభిస్తారని తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు సభలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు.

పీడీఎఫ్ అభ్యర్థికి ఏపీటీఎఫ్ మద్దతు

భీమవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం తరఫున మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఏపీటీఎఫ్ జిల్లా శాఖల తీర్మానాల మేరకు గోపీమూర్తికి మద్దతు ప్రకటించాలని రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారన్నారు. ఉపాధ్యాయులంతా గోపిమూర్తి విజయానికి కృషి చేయాలని రమణ కోరారు.

కౌలు రైతులకు ఓటుహక్కు కల్పించాలి

భీమవరం: సాగునీటి సంఘాల ఎన్నికల్లో కౌలు రైతులకు ఓటుహక్కు కల్పించినట్లుగా మండల, గ్రామస్థాయి అధికారులకు కలెక్టర్ వెంటనే ఆదేశాలివ్వాలని ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలురైతులకు సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని కోరుతూ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కౌలు గుర్తింపు కార్డులు పొందినవారికి తప్పనసరిగా ఓటు హక్కు కల్పిస్తున్నామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఎన్నికలపై ప్రకటనలు చేస్తున్న తహసీల్దార్లు కౌలురైతుల ఓటుహక్కుపై ఎలాంటి ప్రకటనలు చేయడంలేదన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు సైతం కేవలం భూయజమానుల పేర్లను పరిశీలించి ఓటర్ జాబితా తయారు చేస్తున్నట్లు రామాంజనేయులు తెలిపారు. తక్షణం కౌలురైతులను గుర్తించి ఓటర్ లిస్టులో చేర్చాలని, కౌలురైతులు సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటు వేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

యూటీఎఫ్ మండల శాఖ ఎన్నిక

వీరవాసరం: యూటీఎఫ్ వీరవాసరం శాఖ మండల మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్.ప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎంఎంఎస్ సీహెచ్ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్యే పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.విజయరామరాజు, సహాధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు. ముందుగా స్వర్ణోత్సవాల సందర్భంగా రిటైర్ ఉపాధ్యాయులు ఎన్.భానుమూర్తి, చల్లా ఆదినారాయణ,, టీఎం జలజా రాణి, ఎ.గోవిందరాజులను సత్కరించారు.

మహిళపై దాడి ఘటనలో కేసు

ఉండి: స్పందన ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలంటూ మహిళపై భార్యాభర్తలు దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి శివారు రామాపురానికి చెందిన పూసలపాటి శాంతకుమారి అదే ప్రాంతానికి చెందిన దువ్వి సూరిబాబు అతని భార్యపై స్పందనలో ఫిర్యాదు చేసింది. దీనిపై ఈ నెల 8వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో సూరిబాబు అతని భార్య అక్రమంగా శాంతకుమారి ఇంట్లో ప్రవేశించి కొట్టి బెదించారు. గాయపడిన శాంతకుమారి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందారు.ఆసుపత్రి నుండి అందిన సమాచారం మేరకు ఎస్సై నసీరుల్లా ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

భీమవరం అర్బన్: మండలంలోని దొంగపిండి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై వీర్రాజు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,750 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.